ఈనాడు
వికారాబాద్
సోమవారం ఆగస్టు 31, 2026

ఆసుపత్రుల్లో సమస్యలా.. ఫోన్ చేయండి

ఈనాడు, వికారాబాద్ మున్సిపాలిటీ

వర్షాకాలంలో అడపాదడపా వానలు పడుతున్నాయి. మరోవైపు ఎండ వేడిమి తగ్గడంలేదు. వెరసి ఈ సీజన్ భిన్నమైన వాతావరణంతో జిల్లా వాసులను భయపెడుతోంది. వైరల్ జ్వరాలు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ప్రజలు ఆసుపత్రుల బాట పడుతున్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గానీ, ప్రసూతి తదితర ప్రభుత్వ ఆసుపత్రుల్లో కానీ ఎక్కడ సరైన మౌలిక వసతులు లేకపోయినా,



డాక్టర్ సుధాకర్‌లాల్

వైద్యులు, వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాకపోతున్నా.. మందులు సరిగా ఇవ్వకపోయినా.. వైద్య పరీక్షలకు ఇబ్బంది పెడుతున్నా.. ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నా.. నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్నా.. అర్హత లేని వైద్యులు చికిత్స చేస్తున్నా.. మౌనంగా భరించొద్దు. ఆయా సమస్యలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఈనెల 31 సోమవారం ఆయనకు ఫోన్ చేసి మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. మీ సమస్యలను, సందేహాలను, సూచనలను ఆయన దృష్టికి తీసుకెళ్లండి. మీరు చొరవ తీసుకొని చేసే ఫోన్ కాల్‌తో మీతోపాటు ఎంతో మందికి మేలు కలిగే అవకాశం ఉంది.

- ఎప్పుడు ఫోన్ చేయాలి: ఈనెల 31వ తేదీ సోమవారం
- సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- కాల్ చేయాల్సిన ఫోన్ నంబర్లు: 90596 60794, 94404 89057

ఈనాడు ఫోన్ఇన్

శౌచాలయం.. వేశారు తాళం..



తాండూరు రైల్వేస్టేషన్‌లో మహిళలు, పురుష ప్రయాణికులకు అత్యవసర సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. కొంతకాలంగా స్టేషన్‌లోని మహిళల శౌచాలయానికి తాళం వేశారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. దాదాపు పూర్తి కావొచ్చాయి. శౌచాలయం తాళం తీయాలని చిన్నారులు, దివ్యాంగులు, మహిళలు కోరినా.. స్టేషన్ సిబ్బంది తిరస్కరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శౌచాలయాలను ఉపయోగించుకునేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాండూరు పట్టణం

తూకాల్లో మోసం.. ఛార్జీలు భారం

- దండుకుంటున్న రేషన్ డీలర్లు
- రవాణాకు తప్పని ఇబ్బందులు

నిఘా

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ఉచితంగా బియ్యం అందిస్తున్నాయి. వినియోగదారులకు చేతికందే సరికి తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి. రేషన్ కార్డుకు కేటాయించిన బియ్యం తూకాలు సరిగా చేయడం లేదు. మూణ్నెల్ల రేషన్ ఒకేసారి అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బియ్యం తక్కువగా వస్తున్నాయి. మొదట బియ్యం బస్తాతో తూకం వేస్తున్న డీలర్లు తరువాత వినియోగదారులు వెంట తెచ్చుకున్న సంచుల్లోకి నింపుతున్నారు. ఇక్కడే నష్టపోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం ఒక్కో అంత్యోదయ కార్డుకు సైతం ప్రతి నెలా 35 కిలోల బియ్యం కోటా కేటాయిస్తోంది. ఒకేసారి రావడంతో క్వింటాళ్లలో నష్టపోవాల్సి వస్తోంది.

పంచాయతీలు: 594
మండలాలు: 20
ఆహార భద్రత కార్డులు: 2,89,736
లబ్ధిదారులు: 9,86,191
అంత్యోదయ కార్డులు: 26,865
రేషన్ దుకాణాలు: 588
మూణ్నెల్ల కోటా: 19,200 మెట.

కొన్ని గ్రామాల్లో డీలర్లు లేకపోవడంతో..

బియ్యం ఉచితంగా అందుతున్నా పేదలకు మోయలేని భారంగా మారుతోంది. కొన్ని గ్రామాలకు డీలర్లు లేకపోవడంతో పక్క గ్రామాల్లో సరఫరా చేస్తున్నారు. అంతేగాకుండా అనుబంధ గ్రామాలకు చెందిన వారు అవస్థలు పడుతున్నారు. మూణ్నెల్ల బియ్యం కావడంతో వాటిని తీసుకెళ్లేందుకు ఆటో ఛార్జీలు రూ.100 వరకు వెచ్చించాల్సి వస్తోంది. పరిగి పట్టణంలోనూ ఆటో ఛార్జీలు రూ. 100 వరకు వసూలు చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

రేషన్ పంపిణీలో పారదర్శకత తెచ్చేందుకు ప్రభుత్వం ఎంత కృషి చేస్తున్నా.. కొందరు స్వార్థపరులు నీరుగారుస్తున్నారు. దుకాణాల నిర్వహణ, తీరుతెన్నులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ కరవైంది. ఎక్కడా ఆకస్మిక తనిఖీలు చేసి పట్టుకున్న దాఖలాల్లేవు. మండల స్థాయిలో తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తరచూ దుకాణాలను పరిశీలించాల్సి ఉన్నా.. ఇతర బాధ్యతల కారణంగా వారు ప్రత్యేకించి దృష్టి సారించడం లేదు. ఇదే పలువురికి అవకాశంగా మారింది.

అద్దెల తొండి.. ఆదాయానికి గండి

- ప్రభుత్వ సంస్థల నుంచి తక్కువ లీజుకు దుకాణాలు
- ఇతరులకు ఇచ్చి భారీగా వసూళ్లు

న్యూస్‌టుడే, తాండూరు

తాండూరులోని ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 277 దుకాణాలను అద్దెకు తీసుకున్న వారిలో కొందరు మాత్రమే వ్యాపారాలు చేసుకుంటున్నారు. మిగతా చాలా మంది ఇతరులకు లీజుకిచ్చారు. నెలానెలా అద్దెల రూపంలో రూ. లక్షల్లో ఆర్జిస్తున్నారు. సంబంధిత సంస్థలకు మాత్రం రూ.వేలల్లోనే అద్దెలు చెల్లిస్తున్నారు. నిబంధనల ప్రకారం అద్దెకు తీసుకున్నవారే వ్యాపారాలు చేసుకోవాలి. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఇతరులకు అద్దెలకిచ్చి అడ్వాన్స్ కింద రూ.1- 10 లక్షల వరకు తీసుకుంటున్నారు. రూ.5-10వేలు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎవరూ దృష్టి సారించడం లేదు. దుకాణాలపై సంస్థల నుంచి అద్దెకు తీసుకున్న వారే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. రెండు, మూడేళ్లకోసారి అడ్వాన్సులు, అద్దెలు భారీగా పెంచుతున్నారు.



దేవాదాయశాఖకు చెందిన దుకాణాలు

మూడేళ్లకోసారి రెన్యువల్ కావడం లేదు..

నిబంధనల ప్రకారం ప్రభుత్వ పరిధిలోని దుకాణాలను మూడేళ్లకోసారి అధికారులు రెన్యువల్ చేసి అద్దెలు పెంచాలి. ఆసక్తి చూపే కొత్తవారికి దుకాణాలు కేటాయించాలి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పాతవారినే కొనసాగిస్తున్నారు. అద్దెలూ పెంచడం లేదు.

ఇదీ పరిస్థితి..

పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో మున్సిపాలిటీకి చెందిన 11 దుకాణాలున్నాయి. ఒక్కో దానికి రూ. 763 నుంచి రూ.5వేలు అద్దె నిర్ణయించి పదేళ్ల కిందట ఆసక్తి గల వారికి అప్పగించారు. వారు ఇతరులకు అద్దెలకిచ్చి రూ. లక్షల్లో అడ్వాన్స్‌లు, అద్దెల రూపంలో వసూలు చేస్తున్నారు. కొడంగల్ రోడ్డు వారగా ఉన్న మూడు దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగుతోంది. అద్దెలు మాత్రం చెల్లించడం లేదు. రూ. లక్షల్లో బకాయిున్నాయి. • కొత్త కూరగాయల మార్కెట్లో పురపాలికకే చెందిన 31 దుకాణాలున్నాయి. ఒక్కో దుకాణం అద్దె రూ.1200- రూ.2వేలు మాత్రమే. అద్దెలు పాతవే కొనసాగుతున్నాయి. • జాతీయ రహదారి పక్కన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎమ్మెస్) ఒక్కో దుకాణాన్ని రూ.3,500 అద్దెకిచ్చారు. పాత దుకాణాలకైతే రూ.2- 3వేలు అడ్వాన్స్ తీసుకున్నారు. కొత్త వాటికి రూ. 70వేల నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నారు. దుకాణాలు పొందిన వారు ఇతరులకు ఇచ్చి రూ.2- 5 లక్షల పైబడి అడ్వాన్స్ తీసుకున్నారు. నెల అద్దె రూ.5- 10వేలు వసూలు చేస్తున్నారు.• దేవాదాయ శాఖకు చెందిన దుకాణాలను అధికారులు రూ.2,600 నుంచి రూ.4,500 వరకు అద్దెకు ఇచ్చారు. కొందరు ఇతరులకు అద్దెకిచ్చి అడ్వాన్స్‌లు, అద్దెల రూపంలో వసూలు చేస్తున్నారు.

శాఖల వారీగా దుకాణాలు.. మున్సిపాలిటీ: 91 దేవాదాయ, ధర్మాదాయశాఖ: 143 డీసీఎమ్మెస్: 40 వైద్యశాఖ: 3

విన్యాసం.. అబ్బుర పరిచెన్!



తాండూరు మండలం జినుగుర్తిలోని సాందీపని గురుకులంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కనులారా తిలకించిన తల్లిదండ్రులు సంబురపడ్డారు. చప్పట్లు కొడుతూ సంతోషించారు.

- న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ

రామలింగేశ్వరుడికి ఘనంగా పుష్పార్చన



వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం వికారాబాద్ సమీపంలోని బుగ్గ శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం వికారాబాద్ పట్టణ వీరశైవ సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు బిల్వార్చన, పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు ఆత్మలింగం, వీరేశం, విజయకుమార్, భద్రప్ప దంపతులు, అర్చకులు శ్రీకాంత్‌స్వామి, శివశంకర్‌స్వామి పాల్గొన్నారు.

పరీక్షలు పాసైతేనే ప్రవేశం




చేగుంటలోని తెలంగాణ గిరిజన బాలికల క్రీడా పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. మెడిసిన్ త్రోబాల్, బ్రాడ్ జంప్, షటిల్‌రన్, పరుగు, ఎత్తు, బరువు వంటి పరీక్షలను నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపితేనే ప్రవేశాలు లభిస్తాయి. విద్యార్థులు ఉదయం నుంచే తమ తల్లిదండ్రులతో క్రీడా పాఠశాలకు చేరుకున్నారు. గిరిజన గురుకులాల క్రీడాధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఆరు, ఏడు, ఎనిమిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దేహదారుఢ్య పరీక్షలు చేశారు. -న్యూస్‌టుడే, చేగుంట

ఉచ్చు బిగుస్తోంది..

- రైస్ మిల్లులపై సర్కారు కొరడా • రంగంలోకి విజిలెన్స్, ఈడీ

ఈనాడు, వికారాబాద్



ఒకవైపు విజిలెన్స్ సోదాలు, తాఖీదులు.. మరోవైపు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. దీంతో జిల్లావ్యాప్తంగా కలకలం మొదలైంది. సర్కారు ఆదేశాల మేరకు మిల్లర్లు బకాయపడిన రూ.102 కోట్లను తక్షణం వసూలు చేసే ప్రక్రియ ఊపందుకుంది. ఆదివారం నాటికి జిల్లాలోని రెండు మిల్లుల యజమానులు దాదాపు రూ.4 కోట్లు చెల్లించినట్లు తెలిసింది. సోమ, మంగళవారాల్లో ఈ వ్యవహారాలు కీలక మలుపు తిరగనున్నాయంటున్నారు. ముఖ్యంగా జిల్లాలోని రెండు మిల్లులపై అధికారులు దృష్టి సారించారని సమాచారం.

మిల్లర్లు దిగి వస్తున్నారా?

జిల్లాల్లో ఎక్కువ రైస్ మిల్లులు కుల్కచర్ల, పరిగి, వికారాబాద్‌లోనే ఉన్నాయి. ఒక మిల్లు రూ.25-30 కోట్లు, మరోదాంట్లో రూ.17-20 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మిగతావి రూ.20-30లక్షలు మాత్రమే ఉన్నాయి. వారితో జిల్లా అధికారులు మాట్లాడి తొలి విడతగా 50శాతం, మరో రెండు విడతల్లో 25 శాతం చొప్పున మొత్తంగా నూరుశాతం చెల్లించాలని సూచించిచారు. ఈ మేరకు ఆదివారం నాటికి మిల్లర్లు రూ.3.80 కోట్లు చెల్లించినట్లు సమాచారం. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నోరు మెదపకున్నా.. మిల్లర్లకు చెందిన కీలక ప్రతినిధి 'ఈనాడు'తో మాట్లాడారు. ధాన్యం సేకరించినప్పుడు రూ.2,235 ధర ఉందని, దాన్ని రూ.1800కు తగ్గిస్తుందని మిల్లర్లు ఎదురు చూశారన్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా 2022-23లో ధాన్యం భారీగా పండింది. మొత్తం నూరు మిల్లులున్నా.. అందులో 67 సీఎంఆర్ టెండర్లలో పాల్గొన్నాయి. క్వింటాకు రూ.2,235 చొప్పున ధర పెట్టి ధాన్యం కొన్నారు. వాటిని ఇప్పటి వరకు కొందరు మిల్లర్లు మరాడించలేదు. కొందరు మాత్రం వాటిని బియ్యంగా మార్చి అమ్మేశారు. చాలామంది 67శాతం సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి అందించలేదు. వాటిపై జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోలేదనే విమర్శలున్నాయి. తాజాగా ఈ విషయంలో రాష్ట్ర సర్కారు తీవ్రస్థాయిలో పరిశీలిస్తోంది. వారం రోజుల కిందట కుల్కచర్ల, పరిగి, వికారాబాద్‌లోని మిల్లుల్లో తనిఖీలు నిర్వహించింది. అక్కడ ధాన్యం ఉందా.. బియ్యం ఏం చేశారనే కోణంలో యజమానులను అధికారులు ఆరా తీశారు. తాఖీదులు సైతం జారీ చేశారు.

అక్రమాలపై కన్నెర్ర

- మూడేళ్లలో రూ.3.71 కోట్ల విలువైన సరకు పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

- జహీరాబాద్ నుంచి తాండూరులో విక్రయించేందుకు తెస్తున్న కల్తీ, కుళ్లిపోయిన 4 క్వింటాళ్ల బెల్లం ఇటీవల పట్టుబడింది. ఇదే ప్రాంతం నుంచి వారం వ్యవధిలోనే మరోసారి రూ. 66,800 విలువైన 160 కిలోల కల్తీ కోవా, 14 కిలోల కలాకన్ పట్టుకున్నారు. ఈ వస్తువులను మిఠాయి దుకాణాల్లో విక్రయించేందుకు తీసుకొస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.
- 2026 జనవరి నుంచి ఇప్పటి వరకు 38 ఇసుక అక్రమ రవాణా కేసులు, 27 జూదరులు, 7 ఆహార పదార్థాల కల్తీ, 4 నకిలీ విత్తనాల విక్రయ కేసులు నమోదయ్యాయి. వీటితోపాటు మద్యం, రేషన్ బియ్యం పట్టుకొని టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసులు పెట్టారు.

న్యూస్‌టుడే, తాండూరు పట్టణం

నిషేధిత వస్తువుల అక్రమ రవాణా, విక్రయాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు కట్టడి చేస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయించి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కేటుగాళ్లపై కేసులు నమోదు చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు రెక్కీ నిర్వహించి టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు నిందితులను పట్టుకుంటున్నారు. ఎక్కువగా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి నిషేధిత సరకు రవాణా అవుతున్నట్లు పోలీసుశాఖ నిఘా పెట్టింది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.



పట్టుబడిన కల్తీ వస్తువులు

పరిశీలన

మూడేళ్లలో 950 మందిపై కేసులు..

జిల్లాలో 2024- 2026(ఆగస్టు 20వ తేదీ నాటికి) మూడేళ్ల పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 368 కేసులు పెట్టారు. ఇందులో ప్రమేయమున్న 950 మందిపై కేసులు నమోదయ్యాయి. రూ.3,71,31,494 విలువైన సరకును స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ స్నేహమెహ్రా ప్రత్యేక శ్రద్ధతో అక్రమ రవాణా, కల్తీని నివారించాలనే లక్ష్యంతో పోలీసుశాఖలో టాస్క్‌ఫోర్స్ పనిచేస్తోంది.

జిల్లాలో మూడేళ్లుగా నమోదైన కేసులు ఇలా..

వివరాలు	2024	2025	2026(ఆగస్టు)
పట్టుకున్న కేసులు	145	132	81
ప్రమేయం ఉన్నవారు	436	377	137
విలువ రూ.లక్షల్లో	180.48	123.07	67.76

ప్రాణాలతో చెలగాటం..

కల్తీ కోవా, బెల్లం, కలాకన్, కుళ్లిన వస్తువులతో ఆహార పదార్థాలు, రసాయన రంగులతో ఐస్‌క్రీంలు తయారు చేసినవి తింటే ఆరోగ్యాలు పాడవుతాయని వైద్యులు చెబుతున్నారు. జీర్ణాశయ సమస్యలు ఉత్పన్నమవుతాయంటున్నారు. బయటి ఆహారం నాణ్యత పరిశీలించాలని చెబుతున్నారు.

అందరి సహకారంతో..

ప్రజలకు హాని కలిగించే వస్తువుల విక్రయాలు, నిషేధిత వస్తువుల అక్రమ రవాణా, కల్తీ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు సాగితే సమాచారం అందించాలి. అందరి సహకారంతో అక్రమాలను అరికట్టే అవకాశముంటుంది. - స్నేహమెహ్రా, ఎస్పీ

స్వచ్ఛ బడులకు పురస్కారాలు

- జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.లక్ష నజరానా
- ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో సెప్టెంబర్ 30 వరకు నమోదుకు అవకాశం

న్యూస్‌టుడే, కొడంగల్ పట్టణం(బొంరాస్‌పేట)

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రతను పెంచడానికి కేంద్రం నగదు పురస్కారాలు అందిస్తోంది. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ఏటా బడుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఎంపికైన వాటికి నగదు పురస్కారం అందించి ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) పురస్కారాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ఆరు ముఖ్యమైన కొలమానాలకు సంబంధించి 60 సూచికల ఆధారంగా పాఠశాలలకు ఒకటి నుంచి అయిదు స్టార్లు కేటాయించనుంది. అత్యుత్తమ రేటింగ్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలకు ప్రోత్సాహకంగా రూ.లక్ష నగదు అందజేస్తారు.



కొడంగల్ బాలికల ఉన్నత పాఠశాల

పచ్చదనం పెంపే లక్ష్యం

పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణ సుస్థిరత పెంపొందించడం, విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఎస్‌హెచ్‌వీఆర్ లక్ష్యం. దానికి ఆరు కొలమానాలుంటాయి. వాటికి అనుబంధంగా తాగునీరు, వాననీటి సంరక్షణ, శౌచాలయాల అందుబాటు, చేతులు కడుక్కోవడానికి సబ్బు వినియోగించడం, వ్యర్థాలను సమర్థంగా నిర్వహించడం, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, విద్యుత్తు సదుపాయం ఇలా మొత్తం.. 60 సూచికలుంటాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు దీన్ని వర్తింపజేస్తారు.

మొత్తం పాఠశాలలు: 1309
రిజిస్టర్ చేసుకున్నవి: 877
అన్ని వివరాలు అప్‌లోడ్ చేసిన బడులు: 653

స్వయంగా పరిశీలిస్తారు..

ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సెప్టెంబరు 30 వరకు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలి. ప్రతి సూచికకు తగిన ఆధారాలను అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలకులు స్వయంగా పరిశీలించి ఒకటి నుంచి అయిదు వరకు రేటింగ్ ఇస్తారు. జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో గరిష్ఠంగా 20 బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చి వాటిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన వాటికి రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక నగదు అందిస్తారు. ఆయా హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు మూడ్రోజులపాటు దేశంలోని ప్రముఖ సంస్థలను సందర్శించే అవకాశం కల్పిస్తారు

బాలుడి బలవన్మరణం

వికారాబాద్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని రామయ్యగూడ, అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. వికారాబాద్ సీఐ రఘుకుమార్ తెలిపిన వివరాలు.. అంబేడ్కర్ కాలనీకి చెందిన బాలుడు(17) ప్రైవేటుగా పనిచేసేవాడు. తండ్రి గతంలోనే మృతి చెందగా.. తల్లితోపాటు ఉంటున్నాడు. ఇంట్లో పడక గదిలో పంకాకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

తాండూరు గడ్డను భాజపా అడ్డాగా మార్చండి: కేంద్ర మంత్రి

తాండూరు, వికారాబాద్, న్యూస్‌టుడే: తాండూరు గడ్డను భాజపా అడ్డాగా మార్చాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరులో జిల్లా భాజపా అధ్యక్షుడు యు.రమేశ్‌కుమార్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే శాసనసభ ఎన్నికల్లో భాజపా విజయం సాధించాలన్నారు. తాండూరులో ప్రజలతో మమేకమైన భాజపా.. మజ్లిస్ పార్టీతో పోరాడి గెలిచిన చరిత్ర ఉందన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని గెలిపించాలన్నారు. జిల్లా భాజపా అధ్యక్షుడు యు.రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. వచ్చింది పదవి కాదని ఒక బాధ్యత అన్నారు. తాండూరు, పరిగి, వికారాబాద్‌తో పాటు కొడంగల్ నియోజకవర్గాల్లో భాజపా జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర భాజపా ప్రధాన కార్యదర్శి డా. ఎన్.గౌతమ్‌రావు, అచ్చంపేట, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రత్నం, జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రహ్లాదరావు, మాధవరెడ్డి, శివరాజ్, జిల్లా ఇన్‌ఛార్జి సుధాకర్‌రావు, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాహూ శ్రీలత పాల్గొన్నారు.

- వికారాబాద్ పట్టణంలో అండర్‌గ్రౌండ్ రైల్వే వంతెనల నిర్మాణాల కోసం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్ర రైల్వేశాఖమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అతి తక్కువ సమయంలోనే మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, కలెక్టర్ దీపక్‌తివారి, ఎస్పీ రాజేష్‌మీనా, సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణ, భాజపా నాయకులు వడ్ల నందు, రాజశేఖర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. పక్కన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రైల్వేశాఖ అధికారి గోపాలకృష్ణ

మాకూ కావాలి.. ఓ అథారిటీ

• ఉమ్మడి జిల్లాలో నాలుగు ఏర్పాటుకు అవకాశం

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు పట్టణాలను మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో సుడా, గజ్వేల్‌లో గడా పేరిట రెండు యూడీఏలు ఏర్పాటు చేశారు. రాజధానికి సమీపంలో ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి, సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన జహీరాబాద్‌లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పట్టణాల పరిసర ప్రాంతాలను కలుపుకొని అథారిటీలు ఏర్పాటు చేస్తే సమీప ప్రాంతాలు ప్రగతిపథంలో పయనించనున్నాయి.

సుడాపై నిర్లక్ష్యం.. ప్రగతికి దూరం

గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట పట్టణంతో పాటు చుట్టూ 20 కి.మీ.ల పరిధిలోని గ్రామాలను కలుపుతూ సుడా(సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేశారు. గత రెండున్నరేళ్ల నుంచి పాలకమండలితో పాటు పర్యవేక్షణకు అధికారిని నియమించడం లేదు. దీంతో ఈ ప్రక్రియ కాగితాలకే పరిమితం అయింది. ఇదే విధంగా గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన గడా భారాస అధికారం కోల్పోవడంతో రద్దయింది.


సంగారెడ్డి ముఖ చిత్రం

ప్రజాప్రతినిధులు చొరవ చూపితేనే

రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకొస్తేనే అథారిటీల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించిన సమయంలో వీటి ఏర్పాటును ప్రకటిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించినా నిరాశే ఎదురైంది. -ఈనాడు, సంగారెడ్డి

జోరుగా స్థిరాస్తి వ్యాపారం

రాజధానికి సమీపంలో ఉండడంతో సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. దేశవిదేశాలకు చెందిన పేరొందిన సంస్థలు ఈ ప్రాంతంలో భూముల మీద పెట్టుబడులు పెడుతున్నాయి. స్థిరాస్తి వెంచర్లు ఏర్పాటు చేసి తమ వ్యాపార కార్యకలపాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంగా సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇదేవిధంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్(జాతీయ పెట్టుబడుల ఉత్పత్తి మండలి)లో పారిశ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలోనే జహీరాబాద్‌తో పాటు సమీప గ్రామాలను కలుపుతూ జహీరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తేనే ప్రణాళికయుతంగా పట్టణీకరణ జరగనుంది. నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలకు అవకాశాలున్నాయి.

ఉపయోగాలు ఇలా..

• యూడీఏ ఏర్పాటైతే పట్టణ ప్రాంతాల సమగ్ర, క్రమబద్ధమైన అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేయొచ్చు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పట్టణాభివృద్ధి సంస్థల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతాయి.

• మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నివాసయోగ్యమైన పట్టణ జీవనాన్ని ప్రోత్సహించవచ్చు. మాస్టర్ ప్లాన్ రూపొందించి భూ వినియోగాన్ని నియంత్రించొచ్చు. • కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వివిధ పథకాల ద్వారా లభించే నిధులతో కాలనీలు, శివారు గ్రామాల స్వరూపం మారుతుంది. ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షించడంతో స్థానికంగా ఉపాధి పెరుగుతుంది.

మమ్మేలు.. కొమురవెల్లి మల్లన్న


అధికారులు, అర్చకులకు వెండి బిందె, చెంబు అందజేస్తున్న దాతలు


కొమురవెల్లి: ప్రసాదాల కోసం వరుసలో భక్తులు

చేర్యాల, న్యూస్‌టుడే: 'మొక్కులు తీర్చుకున్నం మల్లన్నా.. చల్లంగా దీవించన్నా..' అంటూ భక్తుల వేడుకోలుతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం మార్మోగింది. శ్రావణ మాసం కావడంతో స్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. స్వామి దర్శన, ప్రసాదాల క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. మల్లన్న దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. 37 కుటుంబాలు అభిషేకం నిర్వహించగా, 24 కుటుంబాల సభ్యులు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారని, 20 వేల మంది దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లికి చెందిన అంబటిపల్లి యాదలక్ష్మి కుటుంబ సభ్యులు సుమారు రూ.4 లక్షల విలువైన 1.876 కిలోల వెండితో తయారు చేయించిన బిందె, చెంబులను సమర్పించారు. ఆలయ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ప్రధానార్చకుడు మల్లికార్జున్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుకు దాతలు అంబటిపల్లి మల్లికార్జున్, వెంకటనరేందర్, రాము అందించారు.

బీడీ కార్మికులకు జీవనభృతి అమలు చేయాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ జీవనభృతి రూ.4016 వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో ఆదివారం నిర్వహించిన బీడీ సిగార్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఆధారపడి సుమారు 7లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో. . అధికారంలోకి వస్తే బీడీ కార్మికులందరికీ ప్రస్తుతం ఇస్తున్న భృతిని రూ.4016లకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల పింఛను రూ.7500లకు పెంచాలని, వెంటనే కనీస వేతనాల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, సీఐటీయూ నేతలు సుధాకర్, గోపాలస్వామి, భాస్కర్, శశిధర్, రవికుమార్, శోభ, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ వాసి ప్రతిభ


అందుకున్న పతకాలు చూపిస్తున్న ప్రభు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగాయి. మెదక్ పట్టణానికి చెందిన కొక్కొండ ప్రభు 65 ఏళ్ల విభాగంలో పాల్గొని లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. నిర్వాహకుల చేతుల మీదుగా పతకాలను అందుకున్నారు. మెదక్ జిల్లా క్రీడాకారులు, మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, రాజేందర్ తదితరులు ఆయన్ను అభినందించారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు


పాల్గొన్న క్రీడాకారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణంలోని ఎంఎస్ క్రికెట్ మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-16 ఎంపికలు ఆదివారం నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 124 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన వారు సెప్టెంబరు 7 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-16 టోర్నీలో పాల్గొనాల్సి ఉంటుందని ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి తెలిపారు.

నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య


మాట్లాడుతున్న విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సంగారెడ్డి పట్టణంలోని టీపీటీఎఫ్ భవన్‌లో 'ప్రభుత్వ బడుల బలోపేతం- ప్రభుత్వ బాధ్యత- మనకర్తవ్యం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యకు 20 శాతం నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. 23 వేల బడులను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. విద్య ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూత పడుతున్నాయని ఆరోపించారు. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ముందుకు రావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఎస్టీయూ రాష్ట్ర కోశాధికారి సయ్యద్ సాబేర్‌అలీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

46 కి.మీ రోడ్డులో 30 మలుపులా?

బీజాపూర్ రహదారి నిర్మాణంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసంతృప్తి


చేవెళ్లలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చేవెళ్ల, న్యూస్‌టుడే: 46 కి.మీ. రోడ్డులో 30 మలుపులా.. ఈ తరహా జాతీయ రహదారి నిర్మాణం మరెక్కడా లేదంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ వద్ద బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు అలైన్‌మెంట్ సరిగ్గా లేదని వ్యాఖ్యానించారు. జాతీయ రహదారిని ఇన్ని మలుపులతో నిర్మిస్తే ప్రమాదాలు జరగవా.. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. మర్రిచెట్లకు నష్టం లేకుండా నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ అనుమతించిందని.. అందుకే అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టామని అధికారులు.. ఆయనకు వివరించారు. ఎన్‌జీటీ కేసు వల్ల రోడ్డు నిర్మాణం మూడేళ్లు ఆలస్యమైందని తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న రోడ్డును పది అడుగుల ఎత్తుగా నిర్మిస్తుండటం, సర్వీసు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని భాజపా మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి.. కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. రోడ్డు విస్తరణ కోసం భూములు ఇచ్చిన రైతులకు వారి పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా పోయిందని తెలిపారు. సర్వీసు రోడ్డు నిర్మాణానికి అదనంగా మరో 10 మీటర్ల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు సమాధానమిచ్చారు. సమస్య లేకుండా చూడాలంటూ కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బీజాపూర్ రహదారి పనులపై త్వరలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, చేవెళ్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవర సమత, కౌన్సిలర్లు అత్తెల్లి మనీషా, శైలజ, మాధవి, మమత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు, సంతకం ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: యజమానుల సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ పత్రాలతో రూ.4.2 కోట్ల విలువచేసే రెండు ప్లాట్లు విక్రయించిన మోసగాడిని సూరారం పోలీసులు అరెస్టుచేశారు. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన బాలకృష్ణమూర్తి, మహాలక్ష్మిలకు బౌరంపేటలోని సతీష్‌సొసైటీలో రెండు ప్లాట్లు(600 చదరపు గజాలు) ఉన్నాయి. వాటిని ఇటీవల చింతల్‌కు చెందిన బేతి శ్రీనాథ్‌కు విక్రయించారు. రిజిస్ట్రేషన్ కోసం కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించుకోగా అప్పటికే ఆ స్థలం మరో వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ అయి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై కృష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కూకట్‌పల్లిలోని వివేకనందానగర్‌కు చెందిన కన్నెకంటి శ్రీనివాసరావు సంబంధిత ప్లాట్లకు మూడు నెలల క్రితం ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో వ్యాలిడేషన్ పత్రాలు సృష్టించి తనకు పరిచయం ఉన్న వసుంధ అనే మహిళ పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ తరువాత శ్రీనివాస్‌బాబు అనే మరో వ్యక్తి సహాయంతో నెల రోజుల క్రితం ప్లాట్లను అజయ్ అనే వ్యక్తికి విక్రయించాడు. గతంలో కూడా ఇతనిపై చేవెళ్ల, దుండిగల్, నార్సింగ్ ఠాణాల్లో కేసులున్నట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

లాడ్జిలో వ్యక్తి మృతి

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ లాడ్జిలో వ్యక్తి మృతి చెందాడు. తాండూరు పట్టణ సీఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు మండలం అల్లాపూర్‌కు చెందిన దశరథ్‌రెడ్డి(50).. అయిదు రోజుల కిందట పట్టణంలోని ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. శనివారం సాయంత్రం నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది పరిశీలించగా.. మంచంపై మృతి చెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు లాడ్జి గదిలో మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

విద్యార్థి భవితకు.. విజ్ఞాన్ మంథన్

▲ సెప్టెంబరు 30వరకు దరఖాస్తులకు గడువు

జిల్లా	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు	కళాశాలలు	విద్యార్థులు
సిద్దిపేట	579	87,224	20	6,443
సంగారెడ్డి	211	67,500	20	6,400
మెదక్	156	28,636	16	5,669
వికారాబాద్	176	30,200	14	5,500

న్యూస్‌టుడే, సిద్దిపేట గ్రామీణం, సంగారెడ్డి మున్సిపాలిటీ, చేగుంట: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆరో తరగతి నుంచి ఇంటర్ (11వ తరగతి) వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు ఇస్రో, డీఆర్డీవో శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించే సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ క్రమంలోనే నగదు పురస్కారాలు, భాస్కర పేరిట ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. విద్యార్థుల్లోని శాస్త్రీయ నైపుణ్యాన్ని గుర్తించి విజ్ఞానశాస్త్ర రంగంలో దేశ పురోగతిపై అవగాహన, ప్రయోగాలపై మక్కువ పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా విజ్ఞానభారతి, విజ్ఞాన ప్రసార్, ఎన్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరిట ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు.

అర్హులు.. నమోదు ఇలా..

6 నుంచి 11వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులు. రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబరు 30వ తేదీలోపు అధికారిక వెబ్‌సైట్ https://vvm.org.in ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ విధానంలో తెలుగు, ఆంగ్లం, హిందీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. వెబ్‌సైట్ లేదా చరవాణి యాప్ ఆధారితంగా పరీక్ష రాయొచ్చు. జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10, 11 తరగతులు ఉంటాయి. చరవాణి, ట్యాబ్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ఏదైనా వినియోగించి పరీక్ష రాయొచ్చు.

ఇవీ ప్రయోజనాలు...

పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉంటాయి. రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. జాతీయస్థాయి క్యాంపులు, శ్రీజాన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద ఇస్రో, డీఆర్డీవో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ వంటి ప్రముఖ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించడం, శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. విజేతలకు భాస్కర పేరిట ఉపకార వేతనాలు, ప్రముఖ సైన్స్ ప్రయోగశాలలు సందర్శించే అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల భవిష్యత్తుకు విజ్ఞాన్ మంథన్ ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిద్దిపేట డీఈవో రమేశ్ తెలిపారు.

ముడిసరకొచ్చింది.. ఇక్కత్ గిరాకీ పెరిగింది


దారాల నుంచి బీమ్‌లు పోస్తూ..

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘం ఎన్నికలు పూర్తయి పాలకమండలి ఏర్పడటంతో వస్త్రాల తయారీ.. గిరాకీకి తగినట్టుగా సంస్థలకు అందించే పనుల్లో నేతకార్మికులు నిమగ్నమయ్యారు. రూ.8 లక్షల విలువైన ముడి సరుకు వచ్చింది. ప్రతి నెలా ఆర్డర్లను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంలో ప్రస్తుతం తక్కువ సంఖ్యలో చేనేత కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. విభిన్న రంగుల్లో కాటన్, జరీ, పట్టు చీరలతో పాటు ఇక్కత్ చీరలు, లెనిన్ కాటన్ వస్త్రాలను తయారు చేస్తున్నారు. దుబ్బాక చేనేత సొసైటీలో ప్రస్తుతం 40 మగ్గాలతో 36 మంది కార్మికులు పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్, బెడ్ షీట్స్ వంటివి నేస్తున్నారు. మరో 15 మంది కండెలు చుట్టడం, బీమ్‌లు పోయడం, నింపడం చేపడుతున్నారు.

దుబ్బాక సొసైటీ పనులు, ప్రణాళిక

◆ 8 మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ చీరలు తయారుచేస్తారు. ◆ 25 మగ్గాల మీద రోజూ 200 కాటన్ తువ్వాళ్లు ◆ సీతాకోకచిలుక, శంఖం, పూల ఆకృతుల్లో ఇక్కత్ చీర తయారవుతుంది. ◆ కార్మికులంతా రోజూ 6 చీరలు నేస్తున్నారు. ◆ ఖర్చులు రూ.2500; తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) కొనుగోలు ధర రూ.2800 ఉంటోంది. ◆ తువ్వాలు ఒక్కంటికి రూ.160 ఖర్చు; టెస్కో కొనుగోలు ధర రూ.180 ఉంటోంది. ◆ జకార్డు మగ్గాలు కేవలం 2 ఉన్నాయి. ఇటీవల మరొకటి కొనుగోలు చేశారు. ◆ ప్యూర్ పట్టు.. కాటన్ జరీ.. గొల్లభామ చీరల తయారీ స్వల్పం. ◆ రూ.8 లక్షలతో ముడిసరుకు కొన్నారు. కార్మికుల 3 నెలల వేతనాలు సైతం సొసైటీ చెల్లించింది.

విలువైన పట్టు జరీ చీరలు సైతం తయారుచేస్తాం..

చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధికి అండగా నిలుస్తున్నాం. అన్ని రకాల ఆకృతులతో, విభిన్న రంగుల్లో నేస్తున్న పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్‌కు గిరాకీ పెరిగింది. త్వరలోనే అధిక ధర కలిగిన పట్టు జరీ చీరలను నేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

-అంకం మధు, దుబ్బాక చేనేత సహకార సొసైటీ ఛైర్మన్

మార్జాలంపై మమకారం

• గాయపడిన పిల్లికి శస్త్రచికిత్స చేయించి కాపాడిన జూనియర్ అసిస్టెంట్



న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: తీవ్రంగా గాయపడిన పిల్లి పిల్లకి శస్త్రచికిత్స చేయించడమే కాకుండా రోజూ అవసరమైన సపర్యలు చేస్తున్నారు.. ఆయనే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండం తిరుమల్‌రెడ్డి. జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామం ఆయన సొంతూరు. మూడు నెలల క్రితం తరిగొప్పులలోని ఆయన ఇంట్లో ఓ పిల్లి పిల్లలను పెట్టింది. 15 రోజుల తర్వాత అందులోని ఓ పిల్లికూన ఇంటి ముందు రోడ్డుపై వెళ్తుండగా కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన పిల్లి కూన వెనుక రెండు కాళ్లు దెబ్బ తిని నడవలేక పోయింది.

వదిలేయలేదు

గమనించిన తిరుమల్‌రెడ్డి ఊరకే వదిలేయకుండా పిల్లి పిల్లను ఇంట్లోకి తెచ్చారు. సమీపంలోని ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువెళ్లి చూపించగా పరీక్షించిన వైద్యులు అది బతకడం కష్టమని వదిలేయమని సలహా ఇచ్చారు. ఆయన దానిని వదలేయలేదు. అక్కడి నుంచి వరంగల్‌లోని పశువైద్యశాలలో చికిత్స చేయించారు. కాస్త కోలుకున్నా నడవలేక పోయింది. తర్వాత హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ యూనివర్సిటీకి తీసుకువెళ్లి అక్కడి వైద్యులకు చూపించారు. వారు సర్జరీ చేయాలని చెప్పి కొన్ని మందులు సూచించారు. రెండు రోజుల అనంతరం హనుమకొండలోని ప్రైవేటు పశువైద్యశాలలో చూపించారు. వైద్యులు పలు పరీక్షలు చేసి పిల్లికి నడుముతో పాటు కాళ్లకు శస్త్రచికిత్స చేశారు. బాగా దెబ్బతిన్న ఒక కాలును తొలగించారు. ప్రస్తుతం ఇంట్లో ప్రత్యేక బోనులో ఉంచి ఆయన సంరక్షిస్తున్నారు. ఇన్‌ఫెక్షన్ కాకుండా ఉండటానికి దాని మెడకు కాలర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడు కాళ్లతో నిలబడుతూ మెల్లగా నడవడానికి యత్నిస్తోంది. వైద్యం కోసం ఆయన ఇప్పటికే రూ.50 వేలు ఖర్చు చేశారు. ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ మందులు, పాలు, ఇతర ఆహారం తదితరాలకు రోజూ రూ.200 ఖర్చవుతున్నట్లు తిరుమల్‌రెడ్డి తెలిపారు. గాయం పూర్తిగా మానిన తర్వాత కృత్రిమ కాలు కోసం ప్రయత్నిస్తానన్నారు.

లారీని ఢీకొన్న కారు.. ఇద్దరు మహిళల దుర్మరణం


జహంగీర్‌బీ



ఖాజమ్మ

పరిగి, దోమ, న్యూస్‌టుడే: బీజాపూర్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి పరిగి మండలం రంగంపల్లి - గడిసింగాపూర్ గ్రామాల మధ్య చింతల్‌చెరువు సమీపాన చోటుచేసుకుంది. ఎస్ఐ-2 నాగేందర్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎంపీ అబ్దుల్‌హై పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామంలో గత కొన్నేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పనులు ముగించుకుని హైదరాబాద్‌కు బయల్దేరేందుకు సన్నద్ధమయ్యారు. ఇదే సమయంలో దోమ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఖాజమ్మ (67), తన మనవడు అఫాన్, వికారాబాద్ మండలం పీలారం గ్రామానికి చెందిన జహంగీర్‌బీ (75) ఆర్ఎంపీని కలిసిన అనంతరం పరిగి వరకు కారులో లిఫ్టు ఇవ్వాలని కోరడంతో అంగీకరించి అందరూ బయల్దేరారు. దారిలో చింతల్‌చెరువు సమీపంలోకి రాగానే ముందు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో మహిళలిద్దరూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న వైద్యుడు అందులోనే ఇరుక్కుపోయారు. పోలీసులు అతికష్టమ్మీద బయటకు తీశారు. అఫాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిరువురిని పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యానికి నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన జాతీయ రహదారిపై ఇరువైపులా భారీగా వాహనాలు స్తంభించిపోయాయి. ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. పోలీసులు పరిస్థితులను చక్కదిద్దారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్య

వికారాబాద్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెందిన యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పట్టణం రాజీవ్ గృహకల్పలో ఆదివారం జరిగింది. వికారాబాద్ ఏఎస్సై ప్రకాశ్ తెలిపిన వివరాలు.. రాజీవ్ గృహకల్పకు చెందిన పి.ప్రీతి(20) ఐటీఐ పూర్తి చేసి ఒప్పంద ఉద్యోగిగా వికారాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తూ హైదరాబాద్, బేగంపేట రైల్వేస్టేషన్లలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించేది. అధిక సమయం స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో గమనించిన తల్లిదండ్రులు మంచి పద్ధతి కాదని, తీరు మార్చుకొమ్మని నచ్చజెప్పారు. మార్పు రాకపోవడంతో కాస్తంత గట్టిగా మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



చేర్యాల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. చేర్యాలకు చెందిన యాంసాని పాండు, **వసంత** (59) ద్విచక్రవాహనంపై శనివారం సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఆదివారం ఇంటికి వస్తున్నారు. కొమురవెల్లి ఠాణా పరిధిలోని గుర్జకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పాండుకు స్వల్ప గాయాలు కాగా, వసంత తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ్నుంచి సిద్దిపేటకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

టీపీఎస్‌లుగా ఆదర్శ పాఠశాలలు

• గ్రామీణ విద్యార్థులకు వరం


సంగారెడ్డి జిల్లాలోని మోర్గి పాఠశాల

న్యూస్‌టుడే, మనూరు: గ్రామీణ పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమ విద్య అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. సత్ఫలితాలు వస్తుండటంతో వాటిని తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల(టీపీఎస్)గా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. పూర్వ ప్రాథమిక విద్య నుంచి అయిదో తరగతి వరకు ప్రవేశపెట్టేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలోని బృందం పాఠశాలలను సందర్శించి నివేదికలను రూపొందించింది.

రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి

పూర్వ ప్రాథమిక పాఠశాల విద్య అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మేలు చేకూరుతుంది. ఇప్పటికే ఏటా ప్రవేశాల కోసం రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి. టీపీఎస్‌గా మారితే మరింత డిమాండు పెరుగుతుంది.

-సువర్ణ, ప్రిన్సిపల్ ఆదర్శ పాఠశాల, మోర్గి, సంగారెడ్డి జిల్లా

మూడు జిల్లాల్లో ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా 194 ఆదర్శ పాఠశాలలున్నాయి. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో 31 ఉన్నాయి. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇటీవల రాష్ట్ర బృందం సభ్యులు పాఠశాలలను సందర్శించి సౌకర్యాలు, తదితర వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో వంద మంది ఇంటర్ బాలికలకు మాత్రమే వసతి గృహ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రీప్రైమరీ (నర్సరీ) నుంచి 5వ తరగతి వరకు ప్రవేశపెట్టి.. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే అందులో చేరిన విద్యార్థి ఇంటర్ వరకు చదువుకోవచ్చు. అంతేకాదు టీపీఎస్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. దీంతో ఆకలి బాధలు సైతం ఉండవు. ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పిస్తే ఇంటి నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇది పేద విద్యార్థులకు వరంగా మారనుంది.

ఆదర్శ పాఠశాలల వివరాలు

సంగారెడ్డి: మోర్గి, అక్సాన్‌పల్లి, బస్వాపూర్, బొల్లారం, మాచునూర్, ఝరాసంగం, మునిపల్లి, పోతులబొగుడ, రాయికోడ్, వెలిమెల

మెదక్: చేగుంట, జక్కపల్లి, కోమటిపల్లి, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, తిర్మలాపూర్

సిద్దిపేట: బెజ్జంకి, హుస్నాబాద్, సముద్రాల, నంగునూరు, మిరుదొడ్డి, ఇర్కోడ్, లచ్చపేట, చిన్నకోడూరు, జగదేవపూర్, కొండపాక, ముత్రాజ్‌పల్లి, దౌల్తాబాద్, చేర్యాల, మద్దూరు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రిఫరీగా అందోలు వాసి


తరుణ్‌రాజ్, పీఈటీ

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జూన్ 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన అమ్‌ట్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎఫ్ఐ) జాతీయ కబడ్డీ పోటీల రిఫరీ(న్యాయ నిర్ణేత) పరీక్షలో సంగారెడ్డి జిల్లా అందోలు గ్రామానికి చెందిన తరుణ్‌రాజ్ ఉత్తీర్ణత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ కోచ్‌గా సేవలందిస్తూ జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా అర్హత సాధించడంపై అందోలు క్రీడాభివృద్ధి కమిటీ, జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తరుణ్‌రాజ్ సంగారెడ్డి మహాత్మా జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.

మేల్కోండి.. స్తంభం సరిచేయండి!



మండలంలోని బురాన్‌పూర్ నుంచి చెరువుముందలి తండాకు వెళ్లే రోడ్డు పక్కన ఓ రైతు పొలంలో విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. బలమైన గాలులు వీస్తే పడిపోయే ప్రమాదం ఉంది. రైతులతో పాటు ప్రజలు రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి ఒరిగిన స్తంభాన్ని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూర్: ధారూర్ మండల కేంద్రంలో గత రెండు రోజులుగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సంపూర్ణ ఆనంద్, సర్పంచి ప్రమీల చిన్నయ్యగౌడ్ వారిని పూలమాల, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వికారాబాద్ నియోజకవర్గ సమన్వయకర్త వడ్ల నందు, భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, అమరేశ్వర్ రావు, వరద మల్లికార్జున్, పాండు గౌడ్, వివేకానందారెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తాండూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పాలనా వైఫల్యాలను భారాస శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరులోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 2 -10 వరకు చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో చేపట్టే నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలన్నారు. నాయకులు కోహిర్ శ్రీనివాస్, వీరేందర్‌రెడ్డి, ఉమాశంకర్, నరేందర్‌గౌడ్, శ్రీనివాస చారి తదితరులున్నారు.

'వర్గ పోరాటంతోనే కుల నిర్మూలన'

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కుల నిర్మూలన సాధనకు వర్గ పోరాటం ఒక్కటే మార్గమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమ శిక్షణ తరగతుల సమావేశంలో మాట్లాడారు. అన్ని కులాల్లో పీడిత వర్గ ఐక్యతకు ఆటంకం కలుగుతుందన్నారు.

ఘనంగా శ్రీ రాఘవేంద్ర స్వామి రథోత్సవం



శ్రీ రాఘవేంద్ర స్వామి

కొడంగల్, న్యూస్‌టుడే: పట్టణంలో కేశవనగర్‌లో ఉన్న శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో రెండోరోజు ఆదివారం ఉదయం 10గంటలకు రథోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానికి తరలివచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

గోదాముల నిర్మాణానికి నిధులొచ్చాయ్!

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గంలో ధాన్యం నిల్వకు కష్టాలు త్వరలో తీరనున్నాయి. 4 మండలాల్లో ఒక్కోటి రూ.30 లక్షల వ్యయంతో 34 గోదాములు నిర్మించడానికి వీబీ జీరాంజీ ద్వారా రూ.10.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థలాలు గుర్తించి త్వరలోనే వీటి నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తూకం చేసిన ధాన్యం బస్తాలు

ఏటా కష్టాలే..

రైతులు ఏటా ఖరీఫ్, రబీలో నియోజకవర్గంలోని చెరువులు, వ్యవసాయ బోర్ల కింద 40 వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తారు. వెయ్యికిపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వం వడ్లకు మద్దతు ధర ప్రకటించి గ్రామాల్లోనే కొనుగోలు చేస్తుండడంతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తారు. కానీ అక్కడ తూకం చేసిన ధాన్యం మిల్లులకు తరలించడానికి లారీలు లేక, మిల్లుల్లో క్వింటాళ్ల కొద్దీ నిల్వలు పేరుకోవడంతో బస్తాలు నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటున్నాయి. మిల్లులకు తరలించే వరకు బాధ్యత రైతులదే కావడంతో కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఒక్కోసారి వర్షానికి తడిసి నష్టపోతుంటారు. స్పందించిన ప్రభుత్వం గ్రామాల్లోనే గోదాములను నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

పనులు ప్రారంభిస్తాం..

34 గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి కావలసిన స్థలాలను గుర్తించే ప్రక్రియ జరుగుతుంది. ఇది పూర్తయిన వెంటనే మార్కవుట్ ఇచ్చి పనులు ప్రారంభిస్తాం.
–సురేష్‌బాబు, డీఈ, పంచాయతీరాజ్

4 మండలాల్లో..

• బొంరాస్‌పేట మండలంలో చౌదర్‌పల్లి, ఏర్పుమళ్ల, తుంకిమెట్ల, వడిచెర్ల, కొత్తూరు, నాందార్‌పూర్, రేగడి మైలారంలో. • కొడంగల్ మండలంలో అంగడిరాయిచూరు, ఉడిమేశ్వరం, హస్నాబాద్, చిన్ననందిగామ, అన్నారం, పెద్దనందిగామ, పర్సాపూర్, టేకులకోడ్, హుస్సేన్‌పూర్, ఇందనూరు. • దుద్యాల మండలంలో దుద్యాల, లగచెర్ల, ఈర్లపల్లి, సంగాయపల్లి, సాగారంతండా, మేడిచెట్టుతండా, చిల్‌ముల్‌మైలారం. • దౌల్తాబాద్ మండలంలో ఇండాపూర్, నందారం, గోకాఫస్లాబాద్, బాలంపేట, దౌల్తాబాద్, దేవర్‌ఫస్లాబాద్, కుప్పగిరి, చెల్లాపూర్, నాగసార్, యాంకి గ్రామాల్లో గోదాములను నిర్మిస్తారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్ కలెక్టరేట్: 9121229018
తాండూరు టౌన్: 80086 11300
పరిగి : 80085 73272
కొడంగల్(గ్రామీణ: 9063144754
తాండూరు: 8008902815
(10 AM TO 1 PM)

దుద్యాల, న్యూస్‌టుడే: ? చిల్ముల్‌మైలారంలో మురుగు కాల్వలు లేక రోడ్డు పక్కనే డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు స్పందించాలి.
– గోపాల్, చిల్ముల్‌మైలారం

✓ మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే కాల్వల నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– బాలప్ప, సర్పంచి, చిల్ముల్‌మైలారం

ధారూర్, న్యూస్‌టుడే: ? గ్రామ శివారులో విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. రైతులు పొలం పనులు చేసే సమయంలో గుర్తించకపోతే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.
– రాములు, హరిదాస్‌పల్లి

✓ పరిశీలించి సిబ్బంది ద్వారా తీగలు సరిచేయించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.
–వేణుగోపాల్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ, ధారూర్

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: ? మండల కేంద్రంలోని పలుకాలనీల్లో మురుగు కాల్వలు లేక నీరంతా రోడ్లపై పారుతోంది. అధికారులు స్పందించాలి.– ప్రవీణ్, కాలనీవాసి

✓ మురుగు కాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచి, దౌల్తాబాద్

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: ? గతంలో నిర్మించిన బీటీ రహదారి శిథిలమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిని బాగుచేయాలి. –నర్సిములు, కడిచర్ల

✓ సంబంధిత అధికారితో చర్చించి రహదారిని బాగు చేసేలా చూస్తాం.
–అనురాధ, ఎంపీడీవో, నవాబ్‌పేట

? మండలంలోని చిట్టిగడ్డ, గొల్లగూడ రైల్వేస్టేషన్‌ల మీదుగా రైలు రాకపోకల సమయంలో ఆర్టీసీ బస్సులను నడిపితే జంట నగరాలు, జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.
– శాంతకుమార్, చిట్టిగిద్ద

✓ సంబంధిత అధికారులతో చర్చించి, బస్సులు నడిచే విధంగా చూస్తాం. –అనూరాధ, ఎంపీడీవో, నవాబ్‌పేట

దుద్యాల, న్యూస్‌టుడే: ? హకీంపేటలో చాలీచాలని ఇరుకైన గదుల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
– అంజిలయ్య, హకీంపేట

✓ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. త్వరలోనే ప్రారంభించి ఇబ్బంది లేకుండా చూస్తాం.
– రవీంద్రనరసింహారెడ్డి, సర్పంచి, హకీంపేట

పరిగికి 20 విద్యుత్తు ఉప కేంద్రాలు: ఎమ్మెల్యే



వంతెన పనులు పరిశీలిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: విద్యుత్తు పరంగా పరిగి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పరిగి సమీపాన వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. పరిగి నుంచి జిల్లా కేంద్రానికి నాలుగు వరుసల రహదారి పనులు పూర్తిచేస్తామన్నారు. పరిగి - షాద్‌నగర్ పనులు జరుగుతున్నాయని, నియోజకవర్గానికి 33/11కేవీ 18 విద్యుత్తు ఉపకేంద్రాలు, 400కేవీ, 654కేవీ తీసుకువస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను తీసుకువచ్చి శంకుస్థాపన చేయిస్తామన్నారు. విద్యుత్తు, వ్యవసాయరంగాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో విపణి ఛైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: పేదల సొంతింటి కల నెరవేరుతోందని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తిమ్మాయపల్లిలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, మాట్లాడారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శాంత్‌కుమార్, సర్పంచి శివకుమార్ తదితరులున్నారు.

బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించండి



మాట్లాడుతున్న బీఎంపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు

పరిగి: దేశంలో ఓటు హక్కును జీరో చేస్తున్నారని ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పేపరు ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు మన్యావర్ దాస్‌రాంనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పరిగిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర మహాసభలో పాల్గొని మాట్లాడారు. జనగణనలో బీసీ కాలం పెట్టకుండా బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ ఘట్యానాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలు సాగు చేస్తున్న లావణి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో బోగ్ బండార్



బోగ్‌బండార్ నిర్వహిస్తున్న తండావాసులు

దుద్యాల, న్యూస్‌టుడే: మండలంలోని ముచ్చుకుంటతండాలో గిరిజన సంప్రదాయం ప్రకారం తండావాసులు బోగ్‌బండార్ కార్యక్రమం నిర్వహించారు. తండాలో ఆలయం వద్ద కార్బరి, నాశబి, డవు, హసబీ, గ్రామస్థుల సమక్షంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గోర్‌సిక్ వాడి గోర్‌సేన వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన జిల్లా వాసులు



పతకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

వికారాబాద్‌టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని జింఖానాగ్రౌండులో నిర్వహించిన ఆఫ్ సీజన్ మీట్ అథ్లెటిక్ పోటీల్లో జిల్లా వాసులు సత్తాచాటారు. జిల్లా అథ్లెటిక్స్ మొత్తం 23 పతకాలు సాధించారు. అందులో 8 బంగారు పతకాలు, 8 వెండిపతకాలు, 7 రజత పతకాలతో విజయం సాధించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విజేతలకు పతకాలను అందజేశారు. జిల్లా అత్యధికంగా పతకాలు సాధించిందని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి మొరంగపల్లి అశోక్, రాజరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పూడూరు, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అందిస్తోందని ఆత్మకమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేవనోనిగూడ సర్పంచి నిర్మల అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి భాస్కర్, మాజీ ఉప సర్పంచి దశరత్ నాయకులు నారాయణ, విశ్వనాథం వార్డు సభ్యులు ఉన్నారు.

పనుల నాణ్యత పట్టదా?



ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పలు రకాల పనులకు నిధులు కేటాయిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదార్లు పనులను నాణ్యతగా చేపట్టకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికకు వెళ్లే దారిలో నాగుల చెరువు వద్ద సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ పనులకు నాణ్యత లేని ఇసుకను వాడుతున్నారని పలువురు ఆందోళన చెందుతున్నారు. పనులు ఇలా చేపడితే ఎంత వరకు మన్నికగా ఉంటాయని ఈ స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించాలన్నారు. ఇదే విషయాన్ని సంబంధిత ఏఈ సంపత్ వద్ద ప్రస్తావించగా.. ఎడ్యుకేషన్‌హబ్ నిర్మాణ పనులకు వాడుతున్న ఇసుకనే ఇక్కడ వాడుతున్నామన్నారు. –న్యూస్‌టుడే, దుద్యాల

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

మోమిన్‌పేట: పేదల సొంతింటి కలను సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి కాస్లాబాద్, కేసారం, సయదలిపురం గ్రామాలకు చెందిన రవీందర్, శంకర్‌నాయక్, నిజాం, రాంరెడ్డి ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను నిర్మించుకున్నారు. ఆదివారం నూతన గృహ ప్రవేశాలకు ఆయన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శంకర్‌తో కలిసి హాజరై ప్రారంభించి లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్ నాయకులు సీరాజుద్దీన్, ,మాణయ్య, మహంత్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



గురువులతో విద్యార్థులు..

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆత్మీయంగా జరిగింది. 1988-89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వారంతా ఒకేచోట కలిసి సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే రంగాల్లో స్థిరపడ్డారో, తమతమ అనుభూతులను ఉత్సాహంగా పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు.

డ్వాక్రా మహిళా భవనానికి శంకుస్థాపన

చౌడాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని వాల్యానాయక్ తండా అనుబంధ గ్రామమైన రాంసింగ్ నాయక్ తండాలో డ్వాక్రా మహిళా భవనం పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తండా సర్పంచి మాట్లాడారు. నూతన డ్వాక్రా మహిళా భవనం నిర్మించడం వల్ల మహిళా సంఘాల సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలు, మహిళా అభివృద్ధికి సంబంధించిన వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

చౌడాపూర్, న్యూస్‌టుడే: చౌడాపూర్ పరిధిలోని చాకల్‌పల్లి, కన్మన్‌కల్వ గ్రామాలలో నూతన గృహప్రవేశ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ అశోక్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

దుద్యాల: మండల ఉపసర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హకీంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా సంజీవ్, అనురాధ, ప్రధాన కార్యదర్శిగా బి.మహేశ్‌లతోపాటు మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

రోడ్డుపై విక్రయాలు.. తప్పని తిప్పలు!



రోడ్డుపైన కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ పరిసర గ్రామాల్లో రైతులు పండించిన కూరగాయలను వికారాబాద్ రైతు బజార్‌లో అమ్ముతారు. సాధారణ రోజుల్లో అయితే రైతు బజార్ పక్కనే అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ సముదాయంలో విక్రయిస్తారు. సంత రోజున ఆదివారం విక్రయానికి అధిక సంఖ్యలో రైతులు రావటంతో రైతు బజార్ స్థలం సరిపోక రోడ్డుపైన విక్రయిస్తారు. దీనివల్ల కూరగాయల విక్రయాలు, కొనుగోలుదారులతో రోడ్డు అంతా రద్దీగా మారుతోంది. దీంతో వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ యార్డును పూర్తి చేస్తే కానీ రైతుల సమస్యకు పరిష్కారం కాదని, అధికారులు తగిన చొరవ తీసుకుని యార్డు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

సాధారణ బస్సులు నడపాలని వినతి



లేఖ అందజేస్తున్న పెంటయ్య తదితరులు

పూడూరు, న్యూస్‌టుడే: పరిగి, మన్నెగూడ మీదుగా హైదరాబాద్ దారుల్లో ఆర్డినరీ బస్సుల సంఖ్యను పెంచాలని తిర్మలాపూర్ మాజీ సర్పంచి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు పెంటయ్య ఆధ్వర్యంలో ఆదివారం పరిగి డిపోలో వినతిపత్రం అందించి, మాట్లాడారు. ఈ దారుల్లో అధికంగా ఎక్స్‌ప్రెస్ బస్సులే నడుస్తుండటంతో చిన్న గ్రామాల బస్‌స్టాప్‌ల వద్ద ఆగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అదనంగా ఆర్డినరీ బస్సుల కోసం అధికారులకు సిఫారసు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ వైస్ ఛైర్మన్ సురేందర్ ఉన్నారు.

గిరిజనుడికి ఇల్లు నిర్మించి ఇవ్వాలి: భాజపా

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని ఊరెనికితండాలో అటవీ భూమిలో ఇల్లు కట్టుకుంటున్నాడని నిరుపేద గిరిజనుడి ఇంటిని అధికారులు కూల్చివేయడం అన్యాయమని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి స్థలం కేటాయించి ఇంటిని నిర్మించి ఇవ్వాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భండారి శాంతికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం తండాను సందర్శించిన ఆయన కూల్చిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఫుట్‌బాల్ జట్టుకు నగదు ప్రోత్సాహం

బొంరాస్‌పేట: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన బొంరాస్‌పేట జట్టుకు గ్రామానికి చెందిన గండీడ్ రవికుమార్‌గౌడ్ ఆదివారం రూ.15 వేల నగదు ప్రోత్సాహం అందించి జట్టు సభ్యులను అభినందించారు.

నేడు బైపాస్ రోడ్డు భూసేకరణ సర్వే

యాలాల, న్యూస్‌టుడే: యాలాల మండల పరిధి కోకట్, రసూల్‌పూర్ గ్రామాల పరిధిలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతుల పొలాల్లో భూ సేకరణ సర్వేను సోమవారం ఉదయం ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహిస్తున్నామని యాలాల తహసీల్దార్ గాయత్రి ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 135 మంది రైతులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, సకాలంలో రైతులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సూచించారు.

గుంపులుగా శునకాలు.. వెళ్లాలంటే గుబులు



మండల కేంద్రంలో విపరీతంగా పెరిగిన వీధి కుక్కలు సృష్టిస్తున్న వీరంగంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత కొన్ని నెలలుగా కుక్కల బెడద ఎక్కువ కావడంతో గ్రామస్థులతో పాటు మండల కేంద్రానికి వివిధ పనులకు వచ్చే ప్రజలు వణికిపోతున్నారు. మోమిన్‌పేటలో మాంసం దుకాణాలు, వేడుక వేదికల నిర్వాహకులు మిగిలిపోయిన ఆహారపు వ్యర్థాలను ఇష్టానుసారం పారేస్తుండటంతో కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు అంటున్నారు. ప్రధాన రోడ్లపై సంచరిస్తుండటం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, మోమిన్‌పేట

జానపద దినోత్సవానికి జిల్లా కళారూపాలు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్ రవీంద్ర భారతిలో సోమవారం నిర్వహించే ప్రపంచ జానపద దినోత్సవం ముగింపు వేడుకలకు జిల్లా నుంచి నాలుగు కళారూపాలను ప్రదర్శించే అవకాశం లభించిందని రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా నాయకుడు కృష్ణయ్య, వెంకటేష్ తెలిపారు. యాలాల మండలం జుంటుపల్లికి చెందిన వెంకటయ్య తోలుబొమ్మలాట బృందం, దోమ మండలం ఐనాపూర్‌కు చెందిన చెన్నయ్య అడుగుల చిరుతల భజన, నవాబ్‌పేట మండలం చించల్‌పేట నుంచి శిరీష రెడ్డి మహిళా కోలాటం, బతుకమ్మ, బొంరాస్‌పేట చౌదర్‌పల్లి నుంచి చాకలి వెంకటయ్య వీధి నాటక బృందానికి అవకాశం లభించిందన్నారు. 64 మంది కళాకారులు మంత్రి జూపల్లి, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ రమణాచారి సమక్షంలో ప్రదర్శనలిస్తారని తెలిపారు.

పూర్తయిన ఎంజాయ్‌మెంట్ సర్వే

దోమ: దోమ మండలం దిర్సంపల్లి, అనంతరెడ్డిపల్లి శివారు ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు గాను అధికారులు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎంజాయ్‌మెంట్ సర్వే ఆదివారం పూర్తయింది. పట్టా, అసైన్డ్ పట్టా భూములు కలిపి 305 ఎకరాలు సర్వే చేసినట్లు ఆర్‌ఐ రాంచందర్‌రావు తెలిపారు. రైతులందరూ సహకరించారని తెలిపారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. రైతులకు చెల్లించే పరిహారం ప్రభుత్వం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.

అధికారుల కొరత.. సమస్యల వెత!

కొడంగల్, దుద్యాల, దౌల్తాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని డివిజన్ పరిధిలో వ్యవసాయశాఖలో అధికారులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రైతులు ఎరువుల దుకాణానికి నేరుగా వెళ్లి కొనేవారు. కానీ ప్రస్తుతం యాప్ ద్వారా ఎరువులు, విత్తనాలు బుక్ చేసుకోవాలి. దాదాపు 50 శాతం మంది చదువురాని, పెద్ద ఫోన్‌ల గురించి తెలియనివారున్నారు. అలాంటి వారికి సహాయం చేసే బాధ్యత వ్యవసాయ అధికారులదే. కానీ వారే సక్రమంగా లేకుంటే మా పరిస్థితి ఏవిధంగా ఉంటుందని రైతుల అంటున్నారు.

రైతుల అవస్థలు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు 60 వేల మంది రైతులు ఉన్నారు. వారందరికీ డీఏపీ, యూరియా కొనుగోలు చేయాలంటే ఎఫ్ఎఫ్ఎస్ (ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ సెల్) అనే యాప్‌లో బుక్ చేసుకోవాలి. బుక్ చేసుకొన్న వారికే డీఏపీ, యూరియాను ఎరువుల దుకాణదారులు అందిస్తున్నారు. బుక్ చేసుకోని రైతులకు డీఏపీ రూ.1350 ఉంటే రూ.1700లకు, యూరియా రూ.267 ఉంటే రూ. 310కి విక్రయించంతో పాటు అవసరం లేని బయో మందులను కూడా అంటగడుతున్నారు.

వ్యవసాయశాఖ పరిస్థితి ఇలా..

డివిజన్‌లో 4 ఏవోలకు గాను బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్‌లలో డిప్యుటేషపై విధులు నిర్వహిస్తున్నారు. డివిజన్‌లో మొత్తం 23 మంది ఏఈవోలు ఉండాలి. కానీ బొంరాస్‌పేటలో- 2, కొడంగల్‌లో- 3 మాత్రమే ఉన్నారు. దౌల్తాబాద్, దుద్యాలలో ఏఈవోలు లేరు. ప్రస్తుతం కొన్ని చోట్ల కాంట్రాక్టు ఏఈవోలతో కొనసాగిస్తున్నారు. ఇలా 23 మందికిగాను 15 మంది మాత్రమే ఉన్నారు. నేటికీ 8 మంది ఏఈవోల స్థానాలు ఖాళీగా ఉన్నాయి.



కొడంగల్ వ్యవసాయశాఖ కార్యాలయం

పంటలు ఎవరు నమోదు చేస్తారు..

వానాకాలంలో పంట నమోదును ప్రారంభించాల్సి ఉంది. ఏఈవోలు పంట నమోదు ఆన్‌లైన్‌లో చేస్తేనే రైతులు పండించిన పంటను విక్రయించేందుకు వీలు ఉంది. కానీ ప్రస్తుతం మా పరిస్థితి ఏంటని రైతుల వాపోతున్నారు.

వ్యవసాయశాఖలో ఖాళీలు వాస్తవమే..

డివిజన్‌లోని వ్యవసాయశాఖలో చాలా ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై దౌల్తాబాద్‌కు తులసిని పంపించాం. ఈ ఖాళీల విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరగా భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. –కవిత, జిల్లా వ్యవసాయ అధికారిణి, వికారాబాద్

బైకు ఢీకొని వృద్ధురాలి మృతి

బొంరాస్‌పేట: బైకు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన ఆదివారం తుంకిమెట్లలో జరిగింది. ఎస్సై బాల వెంకటరమణ వివరాల ప్రకారం మండలంలోని జానకంపల్లి గ్రామానికి చెందిన చంద్రమ్మ(58) దుద్యాల లగచెర్లలో బంధువుల గృహప్రవేశానికి వెళ్లేందుకు ఆదివారం తుంకిమెట్లలో బస్సు కోసం వేచి చూస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ షేక్‌పల్లి గ్రామానికి చెందిన రమేష్ బైకును వేగంగా నడుపుతూ చంద్రమ్మను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన ఆమెను తాండూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెకు భర్త, కొడుకు చాలాఏళ్ల క్రితం చనిపోయారు. వరుసకు కొడుకైన సాయప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

యాలాల(బెన్నూర్): విద్యుదాఘాతంలో గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బెన్నూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గాల నరేష్ తన ఆరు గేదెలను ఎప్పటిలాగే ఓ రైతు పొలంలో మేపుతుండగా విద్యుత్తు నియంత్రిక తీగ తగిలి అక్కడే చనిపోయింది.